సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 3 । జూన్ । 2023



మద్యం, సారా ధ్వంసం

అరకులోయ, దేవీపట్నం మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, నాటు సారాను ధ్వంసం చేశారు. 8లో



ఉద్యోగావకాశాలు కల్పించండి

మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలని స్థానిక నిరుద్యోగ గిరిజన యువకులు ఎస్‌ఈని కోరారు. 8లో



బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

లింకేజీ రుణాలతో స్వయంసమృద్ధి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



కొయ్యూరు డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: డ్వాక్రా మహిళలంతా ప్రభుత్వం బ్యాంకుల సహకారంతో అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. కొయ్యూరు మండలంలోని 48 మహిళా సంఘాలకు కొయ్యూరు గ్రామీణ వికాస్ బ్యాంకు మంజూరు చేసిన రూ.1.24 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును శుక్రవారం స్థానిక ఐటీడీఏలో కలెక్టర్ పంపిణీ చేశారు.ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌డీఏ పీడీ మురళీ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేత

● కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: పాడేరు ఐటీడీఏ ఆధీనంలో ఉన్న అద్దె గృహాల్లో నివాసముంటున్న అధికారులు, ఉద్యోగులు అద్దె బకాయిలు చెల్లించకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. చాలామంది అధికారులు, సిబ్బంది నివాసం ఉంటున్న ప్రభుత్వ క్వార్టర్లక అద్దెకొంతకాలంగా చెల్లించడం లేదని పేర్కొన్నారు. సుమారు రూ.8.5లక్షల బకాయిలు పేరుకుపోయాయని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తమ దృష్టికి తీసుకువచ్చినట్టు ఆయన వివరించారు.అత్యధికంగా బకాయిలు చెల్లించని అధికారులు,ఉద్యోగుల క్వార్టర్లను గుర్తించి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

గురుకుల ప్రిన్సిపాల్‌గా సుబ్రమణ్యం

రాజవొమ్మంగి: స్థానిక గిరిజనసంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వి. సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఆయన రాయవోటి నుంచి ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ ఎస్.సత్యవేణి బదిలీ అయ్యారు.

పంచాయతీల ఆదాయం పెంపునకు కృషి

● డీఎల్పీవో రాఘవన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో రాఘవన్

రంపచోడవరం: ఇంటి పన్ను బకాయిలు వసూలు చేసి పంచాయతీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని డీఎల్పీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్ సూచించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి జిల్లా ప్లానింగ్ అధికారి అవగాహన కల్పించారు. పంచాయతీ ఆస్తుల వివరాలు నమోదు చేయని కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య పాల్గొన్నారు.

సంతషెడ్ల పరిశీలన



సంతషెడ్లను పరిశీలిస్తున్న నాబార్డు ఏజీఎం సమంత్‌కుమార్

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సంతషెడ్లను శుక్రవారం నాబార్డు ఏజీఎం సమంత్‌కుమార్ పరిశీలించారు.సుమారు రూ.15 లక్షల నాబార్డు,పంచాయతీ నిధులతో రెండుషెడ్లు నిర్మించారు. వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని, ఈ సమస్య పరిష్కారానికి షెడ్లు నిర్మించామని సమంత్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు బీమాతో ధీమా

జిల్లాలో పిడుగుపాటు, భారీ వర్షాలు, ఉరుములు, విద్యుత్ షాక్, వ్యాధుల కారణంగా మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. పెంపకందారులకు సరైన అవగాహన లేక బీమా చేయించకపోవడంతో వారు ఆర్థికంగా నష్టపోయారు. డాక్టర్ వైఎస్సార్ పశు బీమా చేయించడం వల్ల ఇలాంటి సందర్భాల్లో అండగా నిలుస్తుంది.

● అందుబాటులో డాక్టర్ వైఎస్సార్ పశు బీమా
● రైతులకు వరంలా పథకం
● అవగాహన లేక ప్రయోజనం పొందలేకపోతున్న పెంపకందారులు



పాడి పశువుకు బీమా ట్యాగ్ వేస్తున్న సిబ్బంది

జీవాల వివరాలు

పశువులు	:	6,27,059
గేదెలు	:	91,874
గొర్రెలు	:	1,93,482
మేకలు	:	3,82,596

పాడేరు రూరల్ : మూగజీవాలైన గేదెలు, గొర్రెలు, మేకలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బీమా సౌకర్యం కల్పిస్తోంది. గతంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం స్థానంలో మార్పులు చేసి కొత్తగా డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రూపకల్పన చేసింది. ఈ పథకం రైతులకు ఎంతో వరంగా చెప్పొచ్చు. లబ్ధిదారులు తమ వాటా కింద తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు లేదా ఎస్సీ,ఎస్టీ రైతులు కేవలం 20 శాతం, తెల్లరేషన్ కార్డు లేని వారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే ఈ పథకానికి అర్హత పొందవచ్చు.

● ఒకసారి ప్రీమియం చెల్లిస్తే పశువులు, గేదెలకు మూడేళ్లపాటు, మేకలు, పందులకు ఒకటి నుంచి మూడేళ్ల పాటు ఈ భీమా పథకం వర్తిస్తుంది. గతంలో మాదిరి నెలలు, సంవత్సరాల పాటు కాలయాపన చేయకుండా జీవం మృతి చెందిన 21 రోజులకే వాటి పెంపకందారులు, యజమానుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఏదైన సాంకేతిక కారణాలతో బీమా పరిహారం జమ కాకుంటే ఆ విషయాన్ని సంబంధిత వెబ్‌సైట్లో పొందుపరుస్తారు.

పథకం ప్రయోజనమిలా..

● రెండు నుంచి పదేళ్ల వయసు కలిగి ఒక్కసారైనా ప్రసవమైన ఆవులకు, మూడు నుంచి 12 సంవత్సరాల వయసు కలిగి ఒక్కసారైనా ప్రసవమైన గేదెలకు ఒక్కో కుటుంబానికి గరిష్టంగా ఐదు పశువులు, ఆరు నెలలు ఆపై వయసు కలిగిన గొర్రెలు, మేకలు, పందులకు ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 50 జీవాలకు ఈ పథకం వర్తిస్తుంది.

● దేశవాళి, సంకర జాతి ఆడ, మగ పశువులకు రూ.30వేల వరకు, నాటు జాతికి చెందిన ఆడ,మగ పశువులకు రూ.15వేల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం రాయితీతో బీమా సౌకర్యం కల్పిస్తుంది.

● లబ్ధిదారుడు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకుంటే ఆపై మొత్తానికి పూర్తి ప్రీమియం సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చెల్లిస్తే ఆవులకు, గేదెలకు గరిష్టంగా రూ.1.20 లక్షల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు గరిష్టంగా రూ.15 వేల వరకు బీమా సౌకర్యం ఉంది.

● బీమా సొమ్ము చెల్లించిన పెంపకందారుడు, యజమాని వాటిని వేరే రైతుకు విక్రయిస్తే ఆ వివరాలను ఏడు రోజుల్లో దగ్గర్లో ఉన్న రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలి. అలా చేస్తే జీవాలను కొనుగోలు చేసిన కొత్త రైతుకు బీమా సౌకర్యం వర్తిస్తుంది.

● బీమా పరిహారం పొందడానికి ట్యాగ్ తప్పనిసరి.

అవగాహన కల్పిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకంపై గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. జీవాలకు ఇన్సూరెన్సు తప్పనిసరి. ప్రభుత్వం నిర్ణయించిన బీమా పరిహారం పొందాలంటే ట్యాగ్ తప్పనిసరి. మూగజీవాలు మృతిచెందిన సందర్భంలో వెంటనే పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలియజేయాలి. 21 రోజుల్లో బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అవుతుంది.
– డాక్టర్ జి. వెంకటస్వామి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, పాడేరు

పశు బీమా పొందాలంటే రైతులు తమకు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వారి జీవాల వివరాలతో రైతు వాటా ప్రీమియం సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఆ రైతుకు అతని జీవాలకు బీమా సదుపాయం వర్తిస్తుంది.

బీమా వివరాలు

బీమా మొత్తం	లబ్ధిదారుడి వాటా బీపీఎల్/ఎస్సీ/ఎస్టీ	ఏపీఎల్	కాలపరిమితి
ఆవు / గేదెలు			
రూ.30వేలు	రూ.384	రూ.960	మూడేళ్లు
రూ.15వేలు	రూ.192	రూ.480	మూడేళ్లు
గొర్రె/ మేకలు			
రూ.6వేలు	రూ.36	రూ.90	ఏడాది
రూ.6వేలు	రూ.54	రూ.135	రెండేళ్లు
రూ.6వేలు	రూ.75	రూ.187.5	మూడేళ్లు

రేపటి నుంచి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

సాక్షి,పాడేరు: పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రభాత్‌కుమార్ సింగ్ కుటుంబ సమేతంగా మూడు రోజుల పాటు జిల్లాలోని మన్య ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈనెల 4, 5 తేదీల్లో చింతపల్లి మండలం లంబసింగిలో పర్యటించి, ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షిస్తారు. ఆరో తేదీ ఉదయం లంబసింగి నుంచి పాడే రు మీదుగా అరకులోయకు చేరుకుంటారు. అరకులోయలోని పర్యాటక ప్రాంతాలను వీక్షించిన అనంతరం అరకులోయలో బస చేస్తారు. ఏడవ తేదీ మధ్యాహ్నం అరకులోయ నుంచి బయలుదేరి సాయంత్రానికి విశాఖపట్నం చేరుకుంటారు. ప్రభుత్వ అతిథి గృహంలో న్యాయమూర్తి బస చేస్తారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది.

వెట్టిచాకిరీ నుంచి బాలలకు విముక్తి

● నెలరోజులపాటు దాడులు
● జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి సుజాత

పాడేరు రూరల్ : జిల్లాలోని అన్ని మండలాల్లో నెలరోజుల పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాలలకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పిస్తామని జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి టి. సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వ్యవస్థ మాసోత్సవాలు ఈనెల ఒకటి నుంచి ప్రారంభమయ్యాయని, నెలాఖరు వరకు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో బాల కార్మికులను విముక్తి చేయడానికి కార్మిక శాఖ, ఇతర అనుబంధ శాఖలతో కలిసి 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వివిధ దుకాణాలు, వ్యాపార సముదాయాలు, సంస్థలపై దాడులు నిర్వహించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఎక్కడైనా బాలలను పనిలో పెట్టుకుంటే తెలిసిన వారు తమకు సమాచారమివ్వాలని ఆమె సూచించారు.

సకాలంలో వైద్య సేవలు అందించండి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం



వైద్యాధికారులతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో పీహెచ్‌సీల ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల పీహెచ్‌సీల వైద్యాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా సంబంధిత పీహెచ్‌సీలోని గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని తగిన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీలో 30 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తికి పరీక్షలు నిర్వహించాలన్నారు. బీపీ, షుగర్, టీబీ, క్యాన్సర్ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐడీ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గర్భిణి నెలలు నిండిన వెంటనే 15 రోజుల ముందు సంబంధిత పీహెచ్‌సీలో బర్త్ వెయిటింగ్ హాల్లో చేర్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీల వాదీగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించారు. వైద్యులు క్షేత్ర స్థాయి పర్యటన, సేవలపై ఆరా తీశారు. మలేరియా మందు స్ప్రేయింగ్‌పై సమీక్షించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా స్ప్రేయింగ్ కు ఒక షెడ్యూల్ ఏర్పాటు చేసుకొని ఆ ప్రకారం పూర్తిచేయాలని సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష, డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ రాధిక, ఏఎంవో నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరి రైతు ఆర్థిక బలోపేతమే లక్ష్యం

● రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
● వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో పంపిణీ



ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



ట్రాక్టర్ల పంపిణీలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రవేశపెట్టిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో రూ.1,27,27,245ల వ్యయంతో రంపచోడవరం మండలంలో ఒక ట్రాక్టర్, దేవీపటన్నం మండలంలో రెండు ట్రాక్టర్లు, ఏటపాక మండలంలో మూడు ట్రాక్టర్లు, కూనవరం మండలంలో ఒక ట్రాక్టర్, వీఆర్‌పురం మండలంలో మూడు ట్రాక్టర్లు, చింతూరు మండలంలో మూడు ట్రాక్టర్లు రైతులకు అందజేసినట్టు తెలిపారు. వ్యవసాయ పరికరాలు కూడా గిరిజన రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులకు 40 శాతం రాయితీపై ట్రాక్టర్లు అందజేసినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐదుగురు గిరిజన రైతులు సభ్యులుగా ఉండి ట్రాక్టర్ ద్వారా వచ్చిన ఆదాయం వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. సబ్సిడీపై విత్తనాలు, రుణాలు అందజేస్తున్నట్టు ఆమె వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బందం శ్రీదేవి, కుంజం మురళీ, జెడ్పీటీసీలు పండ వెంకటలక్ష్మి, కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, రంపచోడవరం సర్పంచ్‌లు మంగా బొజ్జియ్య, వడగల ప్రసాద్‌బాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోసు రమేష్ బాబు. ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లు దొర, కుంజం వంశీ, షేక్ కాజా వల్లీ, వ్యవసాయ కమిటీ చైర్మన్ డొక్కులూరి రత్నరాజు, ఏడీఏ సీహెచ్‌వీ చౌదరి, ఏవో లక్ష్మణ్, హెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

నెరవేరుతున్న 75 ఏళ్ల రహదారి కల

● ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
● వనుగుమ్మ – జోడిగుమ్మ రోడ్డు పనుల పరిశీలన



తారురోడ్డు పనులను పరిశీలిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ నేతలు

ముంచంగిపుట్టు: రంగబయలు పంచాయతీ గిరిజనుల 75 ఏళ్ల రహదారి కల తమ ప్రభుత్వ హయాంలో నెరవేరుతుందని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీలో వనుగుమ్మ నుంచి జోడిగుమ్మ వరకు పీఆర్ నిధులు రూ.16.90 కోట్ల వ్యయంతో 22 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలకు శరవేగంగా రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. రంగబయలు పంచాయతీ గిరిజనుల రవాణా కష్టాలు త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన విధానంతోనే మారుమూల గ్రామాలకు సంక్షేమ పథకాలు, సౌకర్యాలు అందుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సాక్షి,పాడేరు: జిల్లాలోని 24 పరీక్షా కేంద్రాల్లో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 4,165 మంది విద్యార్థులు గత పరీక్షలలో ఫెయిలయ్యారు. వీరిలో తెలుగు పరీక్షకు సంబంధించి 1674 మంది విద్యార్థులు హాల్ టికెట్లు పొందగా,1642 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 232 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. మౌలిక వసతులు కల్పించారు. జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణాపురం,తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా తనిఖీ చేశారు.

మోదమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి ప్రకాష్‌బాబు



పూజా సామగ్రితో న్యాయమూర్తి ప్రకాష్‌బాబు దంపతులు, కుటుంబ సభ్యులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని తాడేపల్లిగూడెం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కర్రి ప్రకాష్‌బాబు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.మోదమ్మకు న్యాయమూర్తి ప్రకాష్‌బాబు, అతని భార్య, కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు పసుపు, కుంకుమ సమర్పించారు. ఉత్సవ విగ్రహాన్ని తలపై పెట్టుకుని మోశారు.అనంతరం న్యాయమూర్తి దంపతులతో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. గతంలో ప్రకాష్‌బాబు పాడేరు కోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. ప్రకాష్‌బాబు దంపతులకు పాడేరులోని సీనియర్ న్యాయవాది బండారు వెంకటరమణ, పాడేరు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడులు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, మోదమ్మ చిత్రపటంతో పాటు ప్రసాదం అందజేశారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు



కొండ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: మావోయిస్టుల కదలికలు అధికమయ్యాయని సమాచారంతో సరిహద్దు పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు బలగాలు పహరా కాస్తూ రాకపోకలపై నిఘాను పెంచారు. ముఖ్యంగా మారుమూల బూసిపుట్టు, బుంగాపుట్టు, రంగబయలు ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తనిఖీలు చేసారు. ప్రయాణికుల వివరాలు సేకరించి విడిచి పెట్టారు. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు, కుమడ, కుజభంగి రహదారి,పలు గ్రామాల్లో అటవీ, కొండ ప్రాంతాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతామైన ఒనకడిల్లీ, మాచ్‌ఖండ్, జోలాపుట్టు గ్రామాల్లో సైతం బీఎస్ఎఫ్ బలగాలు సరిహద్దు రాకపోకలకు నిఘాను పెంచారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు,లగేజీలు పరిశీలించారు.అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలో రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీసులతో గస్తీని ఏర్పాటు చేశారు.

స్పందన వినతుల సత్వర పరిష్కారం

● క్షేత్రస్థాయితో తప్పనిసరిగా విచారణ
● కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్పందనలో స్వీకరించిన వినతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో స్పందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులపై అన్నిశాఖల అధికారులు శ్రద్ధ చూపాలని, ప్రతి ఫిర్యాదుకు విచారణాధికారిని నియమించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి.జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గిరిజనులు తమ వ్యక్తిగత,గ్రామాల సమస్యలపై కలెక్టర్‌కు 96 వినతులను అందజేశారు.

● కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ గొర్రెలమెట్ట నుంచి అన్నవరం గ్రామానికి రోడ్డు నిర్మించాలని అన్నవరం గిరిజనులు కోరారు.

● తన కుమార్తె విశాఖపట్నం కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివించేందుకు ఆర్థిక సాయం అందించాలని పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామానికి చెందిన రోజారమణి దరఖాస్తు చేశారు.

● కొయ్యూరు మండలం మఠం భీమవరం పంచాయతీ, కొమ్మునూరు, ఉడత గ్రామాలకు చెందిన 35 మంది చిన్నారులు, 12మంది గర్భిణులు ఉన్నందున కొమ్మునూరులో అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని గిరిజనులు కలెక్టర్‌ను కోరారు.

● పాడేరు మండలం వంజంగి కొత్తూరు రోడ్డు అభివృద్ధి చెందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు.

● పాడేరు మండలం గుత్తులపుట్టు పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన వంతాల లక్షణబాబు తన అటవీ భూమిలో సాగు చేసిన కాఫీతోటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా ఆర్థిక సాయం అందజేసి కాఫీ తోట పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మద్యం, సారా ధ్వంసం



వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ ధీరజ్, సిబ్బంది

అరకులోయ రూరల్: స్థానిక పోలీసుస్టేషన్ సర్కిల్‌లోని అరకులోయ, అనంతగిరి పోలీసుస్టేషన్ల పరిధిలో ఏడు కేసుల్లో పట్టుబడిన 1,096 మద్యం బాటిళ్లు, 47 లీటర్ల సారాను శుక్రవారం పాడేరు ఏఎస్పీ ధీరజ్ సమక్షంలో ధ్వంసం చేశారు. స్థానిక రోడ్లు భవనాలశాఖ కార్యాలయం సమీపంలో మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. సారాను పారబోశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. సీఐ రుద్రశేఖర్, ఎస్‌ఐ సంతోష్ పాల్గొన్నారు.

దేవీపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాటుసారాను రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. మండలంలో 19 కేసుల్లో పట్టుబడిన 275 లీటర్ల నాటు సారా, మరో కేసులో పట్టుబడిన బీరు బాటిళ్లను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

- అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్

డుంబ్రిగుడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంజోడ సిల్క్‌ఫారంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో జరిగే నష్టాలు, పరిసరాల పరిశుభ్రతపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో లభించే చింతపండు, కాఫీ, కొండచీపుళ్లు, మిరియాలు, కూరగాయలు ఇతర వాణిజ్య పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు రామరావు, పోతురాజు పడాల్, కృష్ణం నాయుడు, ఉద్దేంగ్, రేణుక, రామచంద్రరావు, మౌనిక, చంటి పాల్గొన్నారు.

మీ ఇల్లే.. ఇక సినిమా థియేటర్!



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి, నిర్మాత సి.కల్యాణ్, నటుడు జోగినాయుడు తదితరులు

- ఫ్యామిలితో కలిసి మొదటి రోజు మొదటి ఆట చూసే అవకాశం
- దేశంలో తొలిసారిగా ప్రారంభించిన ఏపీ ప్రభుత్వం
- ఏపీ ఫైబర్ నెట్ ద్వారా రిలీజ్ సినిమా
- రూ.99 టికెట్‌తో 24 గంటల పాటు ఎన్నిసార్లైనా చూసే అవకాశం

సాక్షి, విశాఖపట్నం : అరెరె.. మంచి సినిమా రిలీజైంది. ఏ థియేటర్‌లోనూ టికెట్స్ దొరకడం లేదు.. ఫ్యామిలీతో సినిమా ప్లాన్ చేశాను. కానీ నా ప్లాన్ అంతా ఫ్లాప్ అయిందే.. ఈ అనుభవం సినిమా అభిమానులందరికీ చాలాసార్లు ఎదురయ్యే ఉంటుంది. ఇకపై మీ ప్లాన్లు ఫ్లాప్ అవ్వవు.

ఎందుకంటే.. ఫ్యామిలీ మొత్తం.. ఒకే టికెట్‌పై రిలీజ్ సినిమాని ఇంటి నుంచే ఎంచక్కా చూసెయ్యవచ్చు. అదీ 99 రూపాయలకే... అది కూడా 24 గంటల సేపు.. ఆ సినిమాని ఎన్నిసార్లు కావాలంటే అన్ని సార్లు చూడొచ్చు కూడా..నిజమండీ.. రాష్ట్ర ప్రభుత్వం ఫస్ట్ డే.. ఫస్ట్ షో పేరిట ఈ అవకాశం కలిస్తోంది. ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఏంటీ.. ఫస్ట్ డే ఫస్ట్ షో..?

కోవిడ్ తర్వాత సినీ పరిశ్రమ కుదేలైంది. థియేటర్లకు వెళ్లేందుకు జనం భయపడేవారు. క్రమంగా పరిస్థితులు చక్కబడ్డాయి. థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ఓటీటీ ప్లాట్‌ఫారాలు కూడా అదే రీతిలో దూసుకొచ్చాయి. ఓటీటీల కోసమే కొన్ని సినిమాలు తీస్తూ థియేటర్లో కాకుండా ఈ ప్లాట్‌ఫారాలు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఓటీటీ హవా నడుస్తోంది. ప్రజలు థియేటర్‌కు వెళ్లే కంటే ఇంట్లోనే సినిమా చూసేందుకు మొగ్గు చూపుతున్నారు. అందుకే ఇదే బాటలో ఫైబర్ నెట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటీటీలకు భిన్నంగా ఫస్ట్ డే ఫస్ట్ షోను విశాఖ వేదికగా శుక్రవారం ప్రారంభించింది. ఓటీటీ ప్లాట్‌ఫారంలో రిలీజ్ అయిన సినిమాలు థియేటర్‌లో కనిపించవు. కానీ ఫస్ట్ డే ఫస్ట్ షోలో మాత్రం.. థియేటర్‌లోనూ, ఇటు ఇంట్లోనూ ఒకేసారి రిలీజ్ అవుతాయి. సినీ ప్రముఖులతో చర్చలు జరిపి ఈ సేవలను ప్రభుత్వం ప్రారంభించింది.

నిర్మాతలకు లాభమేనా..

తెలుగులో ఏటా వందకుపైగా సినిమాలు విడుదలవుతున్నాయి. ఒక పెద్ద హీరో సినిమా లేదా.. పెద్ద బ్యానర్ సినిమా రిలీజ్ అయితే, చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం కష్టంగా మారింది. థియేటర్లు ఖాళీ అయ్యేంత వరకూ చిన్న సినిమాలు విడుదలకు నోచుకోవు. ఈ సమయంలో థియేటర్లకు వెళ్లి సినిమా చూడలేని వారికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కొత్త సినిమాలు చూసేందుకు తీసుకొచ్చిందే ఫస్ట్ డే ఫస్ట్ షో కాన్సెప్ట్. ఏపీ ఫైబర్ నెట్ తీసుకొచ్చిన ఈ కాన్సెప్ట్ ద్వారా చిన్న సినిమా నిర్మాతలకు ఊతంలా ఉంటుంది. నిర్మాతలకు ప్రమోషనల్ ఖర్చులు తగ్గుతాయి. ఇందులో వచ్చే ఆదాయాన్ని ఫైబర్ నెట్, నిర్మాతలు పంచుకుంటారు. ఉదాహరణకు రాష్ట్రంలోని 660 మండలాల్లోని 950 ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ నెట్ వినియోగదారులు 8 లక్షల మంది ఉన్నారు. వీరిలో కనీసం లక్షల మంది ఫస్ట్ డే ఫస్ట్ షో సినిమా చూసేందుకు సబ్‌స్క్రైబ్ చేసుకుంటే.. దాదాపు రూ.కోటి వస్తుంది. ఈ మొత్తాన్ని ఫైబర్ నెట్, నిర్మాతలు షేర్ చేసుకుంటారు. తద్వారా చిన్న సినిమా నిర్మాతలు కూడా లాభపడి మరిన్ని విభిన్నమైన సినిమాలు వచ్చే అవకాశాలున్నాయి.

తొలి సినిమా నిరీక్షణ :

ఫస్ట్ డే.. ఫస్ట్ షో కాన్సెప్ట్ ద్వారా ప్రజల ఇంటికి చేరువైన తొలి సినిమా నిరీక్షణ.. టేక్ ఒకే క్రియేషన్స్ బ్యానర్‌పై ఉత్తరాంధ్రకు చెందిన వంశీకృష్ణ దర్శకత్వంలో సాయిరోనక్ హీరోగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది.



ఎలా చూడగలరు..?

ఎవరు చూడగలరు..

ఇందుకోసం.. ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఉండాలి. రూ.199 నుంచి ఈ కనెక్షన్ అందుబాటులో ఉంది. కొత్త సినిమాని ఫైబర్ నెట్‌లో రిలీజ్ చెయ్యాలని ప్రభుత్వంతో నిర్మాతలు ముందుగానే ఒప్పందం చేసుకుంటారు. ఆ సినిమా ఎప్పుడు విడుదలవుతుందన్నది ముందుగానే ప్రకటిస్తారు. సినిమా చూడాలనుకున్న వినియోగదారులు.. రూ.99తో ఏపీఎస్ఎఫ్ఎల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. ఆ సినిమా లింక్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకున్న వినియోగదారుడికి పంపిస్తారు. ఒకే టికెట్‌తో ఇంటిల్లపాదీ రిలీజ్ సినిమాను ఫస్ట్ డే రోజున.. ఫస్ట్ షో ఇంట్లోనే చూసుకోవచ్చు. ఈ లింక్ 24 గంటల పాటు యాక్టివేట్‌గా ఉంటుంది. అంటే.. 24 గంటల సమయంలో ఎన్నిసార్లు అయినా ఈ సినిమా చూసుకోవచ్చు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో పాడేరు ఎమ్మెల్యే



మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ధారకొండ పంచాయతీలో శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారి దారకొండ, నల్లమొక్కలు, చిలకవీధి, ఎస్.కొత్తూరు, పనసలబంద గ్రామాల్లో పర్యటించి, 177 గడపలను సందర్శించారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అడుగడుగునా పోలీసు బలగాలు మోహరించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాయి.

– గూడెంకొత్తవీధి

ఏజెన్సీలో వలంటీర్ల సేవలు అభినందనీయం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

మారేడుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడంలో గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 105 మందికి సేవా మిత్ర అవార్డులను అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదాన ప్రాంతంతో పోల్చుకుంటే ఏజెన్సీలో భిన్నమైన పరిస్థితుల ఉన్నాయని, రహదారులు లేని మూరుమూల గ్రామాలకు సైతం వలంటీర్లు నడిచివెళ్లి పింఛన్ అందజేస్తున్నారని తెలిపారు. వలంటీర్ల సేవలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఏటా సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేసేలా ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, వైఎస్ ఎంపీటీసీ సభ్యుడు లక్కోండ రవికుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, సర్పంచ్ కొండా జాకబ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, కాసగాని సుర్యగౌడ్, ఏవో రమణ మూర్తి తదతరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించండి

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో స్థానిక నిరుద్యోగ గిరిజన యువతకు ఒప్పంద ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయిన గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం మాచ్‌ఖండ్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగేశ్వరరావును మండలంలోని నిరుద్యోగ గిరిజన యువత కలిసి ప్రాజెక్టులో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. జోలాపుట్టు జలాశయం వల్ల పూర్వీకులు వ్యవసాయ భూములు కోల్పోయారని, వారు నిరక్షరాస్యులు కావడంతో ఎటువంటి ఉద్యోగ అవకాశాలు పొందలేకపోయారని వారు వివరించారు. ప్రస్తుతం తామంతా ఉన్నత చదువులు పూర్తి చేసి ఉన్నామన్నారు. ప్రాజెక్టులో తాజాగా జరగనున్న ఒప్పంద కార్మికుల భర్తీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని శ్రీబిరసాముండా గిరిజన కార్మిక సంఘానికి చెందిన గిరిజన యువకులు వి.శేషాద్రి ,వి.జయరాం, మదన్ తదితరులు ఎస్‌ఈకి విన్నవించారు. దీనిపై ఎస్‌ఈ నాగేశ్వరావు సానుకూలంగా స్పందించారు. మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో ప్రస్తుతం 20 ఒప్పంద కార్మిక పోస్టులు మంజూరు అయ్యాయని, వాటిలో సాధ్యమైనంత వరకు అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్ : జిల్లా పౌరసరఫరాల సంస్థలో అకౌంటెంట్ గ్రేడ్–3 పోస్టులో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఏ లేదా సీఎంఏలో సెమీ క్వాలిఫైడ్ (ఆయా కోర్సుల్లో ఇంటర్ పాసైన అభ్యర్థులు) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని స్థానిక అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి దరఖాస్తులు పొంది వాటిని పూర్తి చేసి ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపు అందజేయాలని ఆయన కోరారు.

34 కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మారేడుమిల్లి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాము వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్, మల్కన్‌గిరికి చెందిన మహ్మద్ సజ్జాద్, రాహుల్ కుమార్ మిశ్రా, రాహుల్ బత్రా, మంటూ సర్దార్, పంకజ్ మండల్, గురచంద్ మండల్ రెండు ద్విచక్ర వాహనాలపై దారకొండ నుంచి గంజాయిని రాజమహేంద్రవరానికి తరలిస్తుండగా, స్థానిక జీఎంవలస జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 34 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రెండు బైకులు, ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. మరో నిందితుడు కిలో రాజేష్ పరారీ అయ్యాడు. పట్టుకున్న గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



గాలికొండ ఆర్బీకే వద్ద రాయితీ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గాలికొండ, అమ్మవారి దారకొండ పంచాయతీల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. రాయితీపై వ్యవసాయశాఖ పంపిణీ చేస్తున్న మేలురకపు వరి విత్తనాలను గాలికొండ ఆర్బీకే వద్ద రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో విత్తనాలకోసం రైతులు ఎదురు చూసేవారన్నారు. ఇప్పుడు గ్రామాల్లో వారి చెంతకే విత్తనాలు వచ్చి చేరుతున్నాయని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బోయినకుమారి, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఈవోపీఆర్డీ పాపారావు, సర్పంచ్‌లు బుజ్జిబాబు,రామకృష్ణ, తాగునీటి సరఫరా విభాగం జేఈ భగవంతరావు, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, శ్రీనివాస్, రెడ్డి నాయకులు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నేషనల్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి రఘునాథ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రఘునాథ్

అరకులోయ రూరల్: అవగాహనతోనే చట్టాలు, హక్కులను పరిరక్షించుకోగలమని నేషనల్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి సమర్థి రఘునాథ్ తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో మోసాలను అరికట్టాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ రసీదు పొందాలని చెప్పారు. నిత్యావసర సరకులతో పాటు అన్ని రకాల వస్తువుల నాణ్యతాప్రమాణాలను పరిశీలించే విధంగా వినియోగదారులు చైతన్యవంతులు కావాలన్నారు. అప్పుడే మోసాలను అరికట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మర్రి సత్యనారయణ, డీటీ దొన్ను తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే చర్యలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్‌కు వచ్చే రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యులను కలెక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై కేజీహెచ్ అభివృద్ధికి సంబంధించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా పలు విభాగాధిపతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. విభాగాధిపతులు తమకు కావాల్సిన మౌలిక వసతులు, మెడికల్ సామగ్రి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీకి వివరించి, పూర్తి చేసిన పనుల వివరాలు తెలిపారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో 15 పనులకు సుమరు రూ.1.10 కోట్లు, వైద్య పరికరాల నిమిత్తం రూ.కోటి వరకు కలెక్టర్ మల్లికార్జున ఆమోదం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కేజీహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు వైద్యులు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులు చాలా నిరుపేదలని, అత్యవసర సమయాలలో సాధ్యమైనంతగా మంచి వైద్యం అందించి ఆదుకోవాలన్నారు.

పలు రైళ్లు రద్దు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ): భద్రత, ఆధునికీకరణ పనుల కారణంగా విశాఖపట్నం నుంచి, విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేశారు. మరికొన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న విశాఖపట్నం-రాయ్‌పూర్(08527/08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దయింది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 3న విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ విశాఖలో గంట ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 3న అమృత్‌సర్–విశాఖపట్నం (20808) హిరాకుడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అమృత్‌సర్‌లో 5 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 4న సికింద్రాబాద్–భువనేశ్వర్(17016) విశాఖ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 4న చెన్నై సెంట్రల్–హౌరా (12840) మెయిల్ చెన్నై సెంట్రల్‌లో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 4న వాస్కోడగామా–షాలిమార్ (18048) అమరావతి ఎక్స్‌ప్రెస్ వాస్కోడగామాలో 4 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

గమ్యం కుదించిన రైళ్లు

- విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5 నుంచి 12 వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం– కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్– విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు దంతేవాడ నుండి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- ఈ నెల 4న రామేశ్వరం–భువనేశ్వర్ (20895), బెంగళూరు–భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు మార్గమధ్యలో 45 నిమిషాలు, 30 నిమిషాలు నిలిపివేస్తారు.